## క్లుప్తంగా

### చేపల పెంపకంపై శిక్షణ

**నరసన్నపేట:** మత్స్యకార సహకార సంఘాలకు ప్రభుత్వ కల్పిస్తున్న పథకాలు, కార్యక్రమాలు వినియోగించుకోవాలని ఫిషరీస్ ఏడీ టి.సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌లో మంగళవారం ఒక్కరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. చేపల ఉత్పత్తి పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎటువంటి పథకాలు అమలు చేస్తున్నది వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ డి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ సంఘాల సభ్యులకు చేపల ఉత్పత్తి, పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫిషరీస్ సిబ్బందితోపాటు నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గాల నుంచి మత్స్యకార సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### 9 నుంచి డీఎస్సీ శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న రవికుమార్, క్రాంతి

**పాతపట్నం:** మండల కేంద్రంలోని అంతరాబ సమీపంలోని హోండా షోరూమ్ పైన కొరికాన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొరికాన కాంపిటేటివ్ అకాడమీలో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి ఉచిత డీఎస్సీ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు కొరికాన రవి కుమార్, నక్క క్రాంతి తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత డీఎస్సీ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 8వ తేదీ లోగా అకాడమీలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

### యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


వరినాట్లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**జలుమూరు:** యాజమాన్య పద్ధతులతో వరి పంట సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని నరసన్నపేట వ్యవసాయశాఖ ఏడీ కె.రవీంద్రభారతి అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా అక్కురాడలో శ్రీవరి సాగు పద్ధతిలో వరి నాట్లు వరుస క్రమంలో నాడటంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. నాట్లు వేసే ముందు వరి నారు కొనలు తుంచి నాటాలన్నారు. ఇలా చేయడం వల్ల మొదటి దశలో వచ్చే పాము పొడ, అగ్గి తెగులు నివారించుకోవచ్చన్నారు. రైతులు అధిక ఆదాయం కోసం గట్లుపై కంది, బంతి మొక్కలు పెంపకం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ కె.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీటీఎఫ్ మహాసభలు విజయవంతం చేయండి


ఆహ్వాన పత్రాలతో ఏపీటీఎఫ్ నాయకులు

**పోలాకి:** ఏపీటీఎఫ్–1938 రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు, సంఘ నాయకులకు మంగళవారం ఆహ్వానాలు అందించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మూల లక్ష్మణరావు, కిల్లి కృష్ణారావు, బమ్మిడి వెంకటనాగజితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### నీమాస్త్రం తయారీపై అవగాహన


నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**కొత్తూరు:** మండలంలోని బమ్మిడి గ్రామ సచివాలయం వద్ద నీమాస్త్రం కషాయం తయారీపై ప్రకృతి వ్యవసాయం కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ ఎంటీ ఎస్.సూర్యనారాయణ మంగళవారం గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. నీమాస్త్రం తయారీకి అవసరమైన పదార్థాలను రైతులతో సేకరించారు. నీమాస్త్రం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రసం పీల్చే పురుగు రాకుండా నివారిస్తుందన్నారు. పలు రకాల పురుగులు లార్వా దశలో ఉన్నప్పుడు నీమాస్త్రం కషాయాన్ని పిచికారీ చేయడం వల్ల లార్వాలు నాశనమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంబరవిల్లి సూర్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాత ఆందోళన

- రైతుకు అందని పెట్టుబడి సాయం
- వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరుగుతున్న వైనం
- గత ఐదేళ్లూ ఖరీఫ్ పనులకు ముందే రైతు భరోసా కింద సాయం అందజేత
- వన్‌బీలు రాక అందని బ్యాంకు రుణాలు


గుండవల్లిపేట వద్ద ట్రాక్టర్‌తో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

**నరసన్నపేట:** ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు పైనే అవుతుంది. పంట సాగుకు పెట్టుబడి సాయం అందక రైతులు అవస్థలు పడుతున్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఏటా రైతుకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా.. ఆ ఊసే ఎత్తడం లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఏటా సీజన్‌కు ముందే రైతు భరోసా కింద రైతులకు సహాయం అందేది. ప్రస్తుతం రైతులు వడ్డీ, చీటీల వ్యాపారులు చుట్టూ తిరుగుతున్నారు. రూ.2 నుంచి రూ.3లకు వడ్డీకి వాడుతున్నారు. మరోవైపు బ్యాంకుల్లో కూడా రుణాలు సకాలంలో అందడం లేదు. సచివాలయంలో గతంలో వన్‌బీలు రైతులకు వచ్చేవి. ఇప్పుడు ఇవి కూడా రావడం లేదు. వన్‌బీలు లేకపోతే బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదు. విత్తనాలు ఏదో బాధపడి కొనుగోలు చేసినా ఎరువులు, గాబు, మందుల కొనుగోలుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రెండో ఎరువు, మూడో ఎరువులకు తెగుళ్లు, పరుగులు వస్తే వాటి నిర్మూళనకు మందులు కొనుగోలు ఎలా అని ఇప్పటి నుంచే తలలు పట్టుకుంటున్నారు.

**పెట్టుబడిసాయం ఊసెత్తని ప్రభుత్వం..**

ఏటా రూ.20 వేలు రైతులకు సహాయంగా ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఆశపడి రైతులు ఓట్లు వేశారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టారు. అంతా బాగున్నా.. రైతులకు ఇస్తామన్న సాయం గురించి ఇప్పటి వరకు మాట్లాడక పోవడం, విధివిధానాలు ప్రకటించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాగే రోజులు, నెలలు గడిపేస్తే ఎలా అని ఆవేదన చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసాతోపాటు వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలతో రైతులకు కోట్లాది రూపాయలు అందేవని గుర్తు చేసుకుంటున్నారు.

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో (2019–2024) నియోజకవర్గంలోని రైతులకు జరిగిన మేలు**

| పథకం | రైతులు | లబ్ధి |
|---|---|---|
| రైతు భరోసా | 39,909 | రూ.210 కోట్లు |
| వైఎస్సార్ ఉచిత పంటల బీమా | 2,947 | రూ. 2.34 కోట్లు |
| వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు | 19,347 | రూ.11.51 కోట్లు |
| రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ | 769 | రూ.90 లక్షలు |

### పెట్టుబడి ఖర్చు పెరిగాయి



వరి పనులు ప్రారంభించి నెల రోజులు కావస్తుంది. ప్రభుత్వం వచ్చిన వెంటనే పెట్టుబడి సాయం ప్రకటించి రైతులకు అందిస్తారని అనుకున్నాం. ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు ఆర్థిక ఇబ్బందులు పడే అవకాశం ఉంది. చాలా మంది రైతులు అప్పులు చేస్తున్నారు. మూడో ఎరువు, కోతల సమయానికి అయినా సాయం అందివ్వాలి. గత ప్రభుత్వం సకాలంలో ఏటా సహాయం అందివ్వడంతో రైతులు ఇబ్బంది పడలేదు. – **బైరి శ్రీనివాసరావు**, పారిశల్లి, నరసన్నపేట మండలం

### హామీని నిలబెట్టుకోవాలి..



అధికారంలోకి వస్తే రైతుకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తామని కూటమి నేతలు ప్రకటించారు. ఇంకా సహాయం అందివ్వలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా ప్రకటించలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సహాయం అందక పోతే రైతులు అప్పుల పాలవుతారు.

– **జాయి శేషు**, బుచ్చిపేట, నరసన్నపేట మండలం

## చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న డాక్టర్ గొలివి మోహన్‌రావు

**నరసన్నపేట:** మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలుగుతుందని స్థానిక ప్రైవేట్ నర్సింగ్ హోం వైద్యుడు గొలివి మోహన్‌రావు అన్నారు. నరసన్నపేటలోని జ్ఞానజ్యోతీ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలపై చర్యలు–నియంత్రణ అనే అంశంపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న వైద్యుడు మోహన్‌రావు మాట్లాడుతూ చెడు వ్యసనాల జోలికి వెళ్తే జీవితాలు నాశనం అవుతాయన్నారు. మత్తు పదార్థాల నుంచి ప్రజలను చైతన్యవంతం చేయడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఎస్ఈబీ సీఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించినా, వాటిని కలిగి ఉన్నా, విక్రయాలు చేస్తున్నా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులు తినుబండారాల రూపంలో మత్తు పదార్థాలను కళాశాలల కేంద్రంగా ఇస్తున్నారని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్ అధ్యక్షతన జరిగన కార్యక్రమంలో ఎంఈఓ శాంతారావు, ప్రిన్సిపాల్ ప్రవీణ, ఏఎస్ఐ ఆసిరినాయుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

**ఆమదాలవలస:** చెడు వ్యసనాలకు జోలికి వెళ్లి యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సీఐ వాయునందన్ దివాకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మాదకద్రవ్యాల వినియోగం, ప్రభావంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్.స్వామి, సెంట్ ఆన్స్ హెడ్ సిస్టర్ వందన పాల్గొన్నారు.

## ఈ–క్రాప్ నమోదు పరిశీలన


నరసన్నపేట: తామరాపల్లిలో ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ సునీత

**నరసన్నపేట:** రైతులు ఖరీఫ్‌లో తాము పండించిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సునీత తెలిపారు. మండలంలో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. తామరాపల్లిలో ఈ–క్రాప్ నమోదును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ విధిగా పంటలను నమోదు చేసుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వ పథకాలు అందుతాయని, ధాన్యం విక్రయ సమయంలో ఇబ్బంది ఉండదన్నారు. మండలంలో ఈ నెలాఖరు కల్లా ఈ–క్రాప్ పూర్తి చేయాలని వీఏఏలకు సూచించారు.

**ఈ–పంట నమోదు వేగవంతం చేయాలి**

**ఎల్.ఎన్.పేట:** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–పంటనమోదు వేగవంతం చేయాలని గ్రామ సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులకు ఏఓ పైడి లతశ్రీ సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రతీ రైతుకు సంబంధించి ఈ–పంట వివరాలు నమోదు చేయాలన్నారు. రైతులతో కలిసి పంట పొలాలకు వెళ్లి పంటతోపాటు రైతు ఫొటో, రెవెన్యూ గ్రామం, సర్వే నంబర్, పంట వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఉపాధి సిబ్బంది పనితీరు మార్చుకోవాలి


మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

**పాతపట్నం:** ఉపాధి హామీ పథకం సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని, గ్రామాల్లో లేనివారికి కూడా మస్టర్లు వేశారని పలువురు ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు ఆధ్వర్యంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సభను మంగళవారం నిర్వహించారు. సోషల్ ఆడిట్ డీఆర్పీలు పంచాయతీల వారీగా గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్‌లో మొత్తం 979 పనులకు ఖర్చు చేసిన రూ.20.63 కోట్లకు ఆడిట్‌ను నిర్వహించారు. పలు పంచాయతీల్లో మస్టర్ల దిద్దుబాట్లు, అధికంగా వేతనం నమోదు వంటి అంశాలను గుర్తించామన్నారు. ఎస్.ఎస్.మనుగు పంచాయతీలో పని చేయని వారికి పేరిట మస్టర్లు వేయడం, దిద్దుబాట్లు వంటివి ఎక్కువగా ఉన్నాయన్నారు. తెంబూరు గ్రామ పంచాయతీలో 16 మంది దివ్యాంగ సర్టిఫికెట్లు లేకుండా పింఛన్లు పొందుతున్నారన్నారు. ఏ.ఎస్.కవిటిలో ముగ్గురికి, ఎస్.ఎస్.మనుగు, చంగుడి, సీది, తీమర, ఆర్.ఎల్.పురం, దశరథపురం పంచాయతీల్లో మే, జూన్ నెలల్లో మృతి చెందిన వారి బ్యాంక్ ఖాతాలకు పెన్షన్లు వేశారన్నారు. కొంతమంది సాంకేతిక సహాయకులు పని చేసే ప్రదేశాలకు వెళ్లకుండా, పర్యవేక్షణ చేయకుండా మేట్లు ఇచ్చిన మస్టర్లనే ప్రమాణికంగా తీసుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఏపీడీలు పి.రాధ, మురళీధర్, ఎస్టీఎం గౌరీశంకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఏపీఎం మనోరత్నం, ఏపీఓ సురేష్, ఎస్ఆర్పీ పున్నపునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### 132 మందికి నేత్ర పరీక్షలు


కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యుడు ప్రతాప్

**బూర్జ:** మండలంలోని ఓ.వి.పేట గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో 132 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.ప్రతాప్ మంగళవారం తెలిపారు. ఇద్దరు విద్యార్థులకు కళ్లద్దాల కోసం ఎంపిక చేశామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, గుత్తావల్లి పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### గుంతలో దిగబడిన కారు


కారు ముందు భాగం దెబ్బతిన్న దృశ్యం

**సరుబుజ్జిలి:** ఏబీ రోడ్డులోని సరుబుజ్జిలి జంక్షన్ వద్ద ఏర్పడిన గుంతలో మంగళవారం కారు దిగబడింది. కారు యాక్సిల్ విరిగింది. వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గోతిని పూడ్చాలని కోరుతున్నారు.

### ఇనాం భూ సమస్య పరిష్కరించాలి

**సరుబుజ్జిలి:** రొట్టవలసలో 200 ఎకరాల ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు గ్రామానికి చెందిన తాడేల రాజారావు, తాడేల రమణతో పాటు మరికొంతమంది రైతులు కోరారు. ఆమదాలవలసలోని ఎమ్మెల్యే కార్యాలయానికి మంగళవారం వెళ్లి వినతిపత్రం అందించారు. అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు కాకపోవడంతో క్రయ, విక్రయాలు లేక అవస్థలు పడుతున్నామన్నారు.

### శాకంబరీగా శాంతామణి అమ్మవారు


కూరగాయల అలంకరణలో శాంతామణి అమ్మవారు

**నరసన్నపేట:** స్థానిక శాంతామణి అమ్మవారిని మంగళవారం శాకంబరి దేవిగా అలంకరించారు. 12 రకాల కూరగాయలను (వంద కేజీలు) అలంకరణకు వినియోగించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## తల్లిపాలే శ్రేయస్కరం

తల్లిపాలు అమృత సమానమని, పుట్టిన శిశువుకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సిబ్బంది తెలిపారు. నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవరాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం కూడా కొనసాగాయి. తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. బిడ్డ ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు.

– సాక్షి నెట్‌వర్క్


సారవకోట: గోపాలపురంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సుజాత


బూర్జ: లక్కుపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ కర్నేన దీప


నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న నరసన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పీఓ నాగమణ, కార్యకర్తలు


ఎల్.ఎన్.పేట: జగన్నాథపురంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల


పోలాకి: ర్యాలీ నిర్వహిస్తున్న పోలాకి పీహెచ్‌సీ సిబ్బంది


హిరమండలం: ధనుపురంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

### కొత్తూరులో రెండు వసతిగృహాలు

**సీతంపేట:** గిరిజన విద్యార్థుల సౌకర్యార్థం శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో వేర్వేరుగా బాల, బాలికలకు రెండు వసతిగృహాలను ఏర్పాటు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తూరులో వివిధ కళాశాలల్లో చదువుతున్న గిరిజన బాలురు, బాలికలు ఈ వసతి గృహాల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9490942125, 9652858561 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### వైద్య సిబ్బంది ఔదార్యం


అక్కులపేట పీహెచ్‌సీలో నీలవేణిని సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

**ఆమదాలవలస:** మండలంలోని అక్కులపేట పీహెచ్‌సీ పరిధిలో గల బూర్జ మండలం ఉప్పినవలస సబ్ సెంటర్‌లో ఆశ వర్కర్‌గా పని చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన వై.నీలవేణిని వైద్య సిబ్బంది అంతా కలిసి మంగళవారం సత్కరించారు. రూ.25 వేలను సేకరించి ఆ మొత్తాన్ని పీహెచ్‌సీ వైద్యులు బి.వసంత, మీనాకుమారి చేతులు మీదుగా అందజేశారు. గత 17 ఏళ్లుగా విధులు నిర్వహించిన నీలవేణికి ప్రభుత్వం నుంచి ఎటువంటి పెన్షన్, ఇతర సౌకర్యాలు అందవని సిబ్బంది ఆలోచన చేశారు. ఆమె కుటుంబ ఖర్చులకు ఈ మొత్తం కొద్దిరోజులు చేదోడుగా ఉంటుందని అందించనట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజనులకు అన్యాయం చేయడం తగదు



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

**మెళియాపుట్టి:** అటవీ నియమాల–2023 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుచ్చి గిరిజనుల ఆర్థిక మనుగడను ప్రశ్నార్థకంగా మార్చడానికి కుట్ర చేస్తుందని అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు వంకల మాధవరావు అన్నారు. మండలంలోని రింపి గ్రామంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజనులతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్పొరేట్లకు లబ్ధి చేకూరేలా అటవీ సంరక్షణ నియమాలతో చట్టాలు తీసుకువచ్చారని విమర్శించారు. అటవీ సంరక్షణ చట్టం–2018ని కేంద్ర ప్రభుత్వం సవరించి గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. గిరిజన ప్రజానీకం జీవించే హక్కును కోల్పోయేలా అడవులను కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెట్టడం బాధాకర మని, ఈ జీఓను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నాయీబ్రాహ్మణులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న వెంకటరావు

**ఎల్.ఎన్.పేట:** కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న నాయీబ్రాహ్మణులను ప్రభుత్వం గుర్తించి వారి సంక్షేమం కోసం ప్రత్యేకమైన పథకాలను అమలు చేయాలని శ్రీకాకుళం జిల్లా నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి వెంకటరావు ప్రభుత్వాన్ని కోరారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో మంగళవారం శ్రీబంగారమ్మతల్లి నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నాయీబ్రాహ్మణుల్లో ఆర్థికంగా, అన్ని విధాలుగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించి వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందరికీ అందేలా కమిటీ సభ్యులు పనిచేయాలన్నారు. మండలం నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మల్లేటి సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కల్లెపల్లి భాస్కరరావు, కార్యదర్శి ఆచంటి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎంసీ ఎన్నికలకు సహకరించాలి

**కొత్తూరు:** ఈ నెల 8 తేదీన నిర్వహించనున్న ఎస్ఎంసీ ఎన్నికల సందర్భంగా మండలంలోని 25 పాఠశాలలను సమస్యాత్మకమైనవిగా ఎంఈఓలు గుర్తించారు. ఎన్నికల రోజు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను కోరారు. కొత్తూరు, మెట్టూరు, కుంటిభద్ర, నివగాం, మాతల కడుము, కురిగాం ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ–వసప, కొత్తూరు–1, కొత్తూరు బీసీ కాలనీ, కుంటిభద్ర కాలనీ, వసప, వసప కాలనీ, బమ్మిడి, సిరుసువాడ, వెంకటాపురం, నీలంతాపురం, కడుము కాలనీ, ఆర్‌కేపురం, మదనాపురం, ఆకులతంపర, దమిలి, మహదేవిపురం, కురిగాం ఎంపీపీఎస్‌లు, మాకవరం, పాతపానుటూరు ఎంపీయూపీ పాఠశాలలను సమస్యాత్మకమైనవిగా విద్యాశాఖ అధికారులు గుర్తించారు. గొడవలు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

### పాతపట్నంలో భారీ వర్షం


పాతపట్నంలో కురుస్తున్న వర్షం

**పాతపట్నం:** పాతపట్నం పరిసర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మూడు గంటలపాటు వర్షం కురవడంతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అచ్చుతాపురం, ప్రహరాజపాలెం, కొదూరు, గోపాలపురం, బూరగాం, కొరసవాడ, సీది, ఆర్.ఎల్.పురం, సరాలి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పాతపట్నంలో సుమారు రెండు గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.